ఏం కొనేటట్టు లేదు తినేటట్టు లేదు

- మండుతున్న కూరగాయలు, చికెన్ ధరలు
- పేద, మధ్యతరగతి ప్రజలపై ఆర్థికభారం



పెరిగిన కూరగాయల ధరలు



ప్రస్తుతం టమాట కిలో రూ.70, మిర్చి కిలో రూ.100, వంకాయ కిలో రూ.80, బీరకాయలు కిలో రూ.100, బెండకాయలు కిలో రూ.50, కాలీఫ్లవర్ కిలో రూ.100, దొండకాయలు కిలో రూ.80, కాకర కాయ కిలో రూ.80 వరకు విక్రయిస్తున్నారు. అలాగే చికెన్ స్కిన్‌లెస్ రూ.280, విత్ స్కిన్ రూ.260, కోడి గుడ్డు ఒకటి రూ.7కు పెరిగాయి. ఎండలకు కూరగాయల సాగు తక్కువగా ఉండడంతో ధరలు పెరిగాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.





కూరగాయలు

జ్యోతినగర్: ఎండలు ఎలా మండుతున్నాయో కూరగాయలు, చికెన్ ధరలు అలాగే భగ్గుమంటున్నాయి. ప్రధానంగా టమాట, మిర్చితో పాటు ఇతర కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. కూరగాయల వినియోగానికి అనుగుణంగా సరఫరా లేకపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలకు కొనుగోలు చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. కూరగాయల ధరలు చుక్కల్లో ఉంటున్న క్రమంలోనే చికెన్ ధరలు కేజీకి రూ.280కి చేరింది. కూరగాయలు, ఆకుకూరలు, చికెన్ ధరలు ఒక్కసారిగా పెరగడంతో కొనుగోలు చేసేందుకు పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

ఆర్థికంగా భారం



కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో నెలవారీ బడ్జెట్ పెరిగిపోయింది. ఆర్థికంగా అదనపు భారం పడుతోంది. ధరలు చూస్తే కొనుగోలు చేయడానికి భయమేస్తోంది. వంటకు కావాల్సిన ప్రతి వస్తువు ధర రెట్టింపు అయింది. నిత్యావసర సరుకులు ఒక దానికి ఒకటి పోటీ పడుతున్నట్లు ఉంది. గతంలో నెలరోజులకు అయ్యే వంటింటి ఖర్చు ప్రస్తుతం పదిరోజులకు కూడా సరిపోవడం లేదు. ఆర్థిక భారం మోయాల్సిన దుస్థితి నెలకొంది. – స్వరూప, గృహిణి, నర్రాశాలపల్లె

అమ్మకాలు తగ్గాయి



ఎండలకు కూరగాయల పంటలు పండకపోవడంతో తక్కువగా రావడంతో ధరలు పెరిగాయి. వారంరోజుల క్రితం రూ.20కు కిలో ఉన్న టమాట ప్రస్తుతం కిలో రూ.70 అయింది. ధరలు ఎక్కువగా ఉండటంతో కూరగాయల అమ్మకాలు తగ్గాయి. వర్షాలు పడితే మళ్లీ కొత్త పంటలతో కూరగాయల ధరలు తగ్గవచ్చు.

– సంతోష, కూరగాయల విక్రేత, ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్

సమస్యల స్వాగతం



మందుబాబులకు అడ్డాగా మారిన నిట్టూరు గ్రామ ప్రాథమిక పాఠశాల



రేకులు కూలిపోతూ దర్శనమిస్తున్న తుర్కల మద్దికుంట ఉన్నత పాఠశాల

మరో నాలుగైదు రోజుల్లో బడులు పున:ప్రారంభం కానున్నాయి. బడిబాట పట్టిన ఉపాధ్యాయులకు పాఠశాలల్లో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ప్రహరీ లేక కొన్ని పాఠశాలలు మందు బాబులకు అడ్డాగా మారగా, మరికొన్ని బడులు దుర్గంధం వెదజల్లుతూ తలుపులు, కిటికీలు విరిగిపోయి అధ్వానంగా మారాయి. అమ్మ ఆదర్శ పాఠశాలల పథకంలో మస్తాబవుతున్నా స్కావెంజర్లు లేక పాఠశాలలు అసౌకర్యంగా దర్శనమిస్తున్నాయి. మరో నాలుగైదు రోజుల్లో తెరుచుకోనున్న బడులు సమస్యలకు నిలయంగా మారాయి. పెద్దపల్లి జిల్లా నిట్టూరు గ్రామ ప్రాథమిక పాఠశాల ఆవరణం బీరు సీసాలతో కనిపించగా, తుర్కల మద్దికుంట గ్రామ పాఠశాల రేకులు ఊగిసలాడుతూ, కిటికీలు విరిగిపోయి 'సాక్షి' కెమెరాకు కనిపించాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

క్లుప్తంగా

బీసీ కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలి



వినతిపత్రం అందిస్తున్న బీసీ నాయకులు

మంథని: మంథని మున్సిపల్ పరిధిలో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 5గుంటల స్థలం కేటాయించాలని బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున్‌కు వినతిపత్రం అందించారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంథని ఎమ్మెల్యే రూ.5లక్షలు కేటాయించారని పేర్కొన్నారు. స్థలం కేటాయిస్తే కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడుతామన్నారు. నాయకులు ఐలి శ్రీనివాస్, బండారి ప్రసాద్, పెంటరి రాజు, కందుకూరి రామ్మూర్తి ఉన్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీసీజీ వ్యాక్సినేషన్‌పై శిక్షణ, అవగాహన కార్యక్రమం శుక్రవారం మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ 2025 వరకు టీబీ నిర్మూలనే ధ్యేయంగా పనిచేయాలని, ఈ టీకా మూడు నెలలు అందుబాటులో ఉంటుందని, 18 ఏళ్లు నిండిన వయోజనుల అనుమతితోనే బీసీజీ వ్యాక్సిన్ వేయాలని సూచించారు. శిక్షణ, అవగాహన కార్యక్రమంలో సీహెచ్‌వో కలీమొద్దీన్, హెచ్‌వీ వసంత, ఏఎన్‌ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచినీటి కనెక్షన్లపై ఇంటింటా సర్వే



మాట్లాడుతున్న ఎంపీడీవో తిరుపతి

ఓదెల: మంచినీటి కనెక్షన్లపై ఇంటింటా సర్వే జరుగుతోందని ఎంపీడీవో జి.తిరుపతి తెలిపారు. మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 22 గ్రామాల్లో ప్రతి ఇంట్లో మిషన్ భగీరథ, పంచాయతీ మంచినీటి కనెక్షన్ ఉందా లేదా అని సర్వే చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో భాస్కర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు పట్టా సర్టిఫికెట్స్ వెరిఫికేషన్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ న్యూమారేడుపాక గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం భూనిర్వాసిత పట్టా సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ఉంటుందని న్యాయవాది మెండ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూనిర్వాసితుల పట్టా సర్టిఫికెట్ బాధితుల విషయంలో 15–04–2024న గౌరవ హైకోర్టు ఆదేశాలను అమలు చేయించే ప్రక్రియలో భాగంగా ఈనెల 8న న్యూమారేడుపాక గ్రామానికి చెందిన 92 మంది భూనిర్వాసితులు తమ వద్ద ఉన్న ప్లాట్‌లకు, ప్లాట్‌లలో నిర్మించిన ఇంటికి సంబంధించి పత్రాలను తమ వెంట తీసుకొని ఉదయం 9 గంటలకు పాఠశాలకు రావాలని ఆయన కోరారు.

డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్‌లోని మూడో డివిజన్ అభివృద్ధికి ఎన్టీపీసీ రామగుండం సీఎస్సార్ ద్వారా నిధులు మంజూరు చేయాలని డివిజన్ అభివృద్ధి కమిటీ, కాంగ్రెస్ ఎన్టీపీసీ పట్టణ ప్రధాన కార్యదర్శి మేరుగు లింగమూర్తి, జిల్లా బీసీసెల్ కార్యదర్శి మామిడాల రాజేశం ఎన్టీపీసీ సీఎస్సార్ ఉన్నతాధికారి ప్రవీణ్‌కుమార్ చౌదరికి వినతిపత్రం అందించారు. శుక్రవారం ప్రాజెక్టు పరిపాలనా భవనం సీఎస్సార్ విభాగం ఉన్నతాధికారి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్టీపీసీ ప్లాంట్ నిర్మాణ సమయంలో భూములు కోల్పోయిన మేడిపల్లి గ్రామంలో ఆర్వో ప్లాంట్, కమ్యూనిటీ సెంటర్, సోలార్ దీపాలు, ఎలక్ట్రానిక్ దీపాలు, న్యూబోర్ వెల్స్, రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ మరమ్మతుకు నిధులు విడుదల చేయాలని కోరామని తెలిపారు. గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, ఇటీవల కురిసిన భారీ వర్షంతో నష్టపోయిన పునరావాస గ్రామాల కుటుంబాలను ఆదుకోవాలని, ఇంటి పైకప్పులు ఎగిరిపోవడంతో ఆర్థికంగా నష్టం వాటిల్లిందని వారిని ఆదుకోవాలని కోరినట్లు వివరించారు.

నియామకం

రామగుండం: అంతర్గాం మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా కుందనపల్లి పంచాయతీ కార్యదర్శి కృష్ణ శుక్రవారం ఎన్నికయ్యారు. పలువురు పంచాయతీ కార్యదర్శులు కృష్ణను అభినందించారు.

బడీడు పిల్లలను బడుల్లో చేర్పించండి



ఎలిగేడు మండలం ముప్పిరితోటలో..



రామగుండం: బడిబాటలో హైస్కూల్ సిబ్బంది

రామగుండం: ప్రభుత్వ పాఠశాలల్లోనే అర్హులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన అందుతుందని, బడీడు పిల్లలను బడుల్లో చేర్పించాలని రామగుండం హైస్కూల్ హెచ్‌ఎం.అజ్మీర శారద కోరారు. శుక్రవారం హైస్కూల్ పరిధిలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. మురికివాడల్లో పర్యటిస్తూ బడి బయట ఉన్న పిల్లల వద్దకు వెళ్లి కలిశారు.

సర్కారు బడిలో చేర్పించండి

కమాన్‌పూర్: పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతూ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. సర్కారు బడుల్లో ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఎలిగేడు: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతూ వివరిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం రెండోరోజు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతూ బడీడు పిల్లలు, బడిమానేసిన పిల్లల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఎలిగేడు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం దేవేందర్‌రావు, ధూళికట్ట, ఎలిగేడు జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎంలు నరేంద్రచారి, సదయ్య, సీఆర్పీ లక్ష్మీనారాయణ, యూపీఎస్, పీఎస్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కళాకారులకు రిటైర్మెంట్ ఉండదు

గోదావరిఖనిటౌన్: ఉద్యోగులకు వయసుతో రిటైర్మెంట్ ఉంటుంది గానీ కళాకారునికి రిటైర్మెంట్ ఉండదని నియర్ అండ్ డియర్ సంస్థ నిర్వాహకుడు పీ.ఎస్ అమరేందర్ అన్నారు. గురువారం రాత్రి స్థానిక దుర్గానగర్‌లోని రెయిన్‌బో పెంట్ హౌస్‌లో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల రిటైర్మెంట్ అయిన సింగరేణి ఓసీపీ–1, ఆర్జీ–3 ఈపీ ఆపరేటర్ పోతుల చంద్రపాల్‌ను స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్, నియర్ అండ్ డియర్, రామగుండం కళాకారుల సంక్షేమ సంఘం, గోదావరి సరిగమలు, రామగుండం ఏరియా యూట్యూబర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. కళాకారులు దామెర శంకర్, సిరిగ సంజయ్‌కుమార్, వేల్పుల మురళీధర్‌యాదవ్, మొగరం గట్టయ్య, దీటి వెంకటస్వామి, అందె సదానందం, మేజిక్ హరి, మాదరి వాసు, తిప్పబత్తిని అంజయ్య, వెంకటి, వెంకట్రాజం, శంకర్, సంపత్, రాజేశ్వర్‌రావు, నారాయణ పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్ అనుమతి రద్దు చేయండి

మంథని: మంథనిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాల అనుమతి రద్దు చేయాలని శ్రీపాదకాలనీకి చెందిన బెజ్జంకి డిగంబర్ జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేశారు. అనుమతి ఒక చోట తీసుకుని మరో చోట నిర్వహిస్తున్నారని, కనీస సౌకర్యాలు లేవని, ఫీజులు సైతం పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ధర్మారం: మండలంలోని మల్లాపూర్, కొత్తూరు, ధర్మారం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ధర్మారం ఏఈ ఖాసీం తెలిపారు. ప్రతి రెండో శనివారం మరమ్మతు పనుల దృష్ట్యా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ నిలిపివేసి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కమాన్‌పూర్ మండలంలో..

కమాన్‌పూర్: మండల కేంద్రంతో పాటు గుండారం, రాజాపూర్, సిద్దిపల్లె, పెంచికల్‌పేట, జూలపల్లి గ్రామాల్లో ఆదివారం ఉదయం 7గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాజేంద్రకుమార్ తెలిపారు.

ఎలిగేడు మండలంలో..

ఎలిగేడు: మండలంలోని లోకపేట, ఎలిగేడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో నెలవారీ మరమ్మతు ఉన్నందున శనివారం ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ సంపత్‌రెడ్డి తెలిపారు.


మృతుడి కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న విప్, ఎమ్మెల్సీ

ధర్మారం: మండలంలోని కటికెనపల్లికి చెందిన కాంగ్రెస్ మండల మాజీ ప్రధాన కార్యదర్శి హత్యకు గురైన విషయం తెలిసిందే. కాగా శుక్రవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సింగిల్‌విండో మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, చింతల ప్రదీప్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ముత్తారం: మండలంలోని లక్కారం జెడ్పీ పాఠశాలలో 2005–06లో పదో తరగతి చదివిన విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు శంకర్‌లింగం, చంద్రయ్య, బర్ల శ్రీనివాస్, విజయలక్ష్మిని సన్మానించారు. అనంతరం తమ ప్రస్తుత జీవన విధానం, పలు అంశాలపై చర్చిస్తూ సెల్ఫీలు దిగి ఆనందంగా గడిపారు.

జీజీహెచ్‌లో పనిచేయని ఎక్స్‌రే యంత్రం



పనిచేయని ఎక్స్‌రే యంత్రం

కోల్‌సిటీ: దావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో శుక్రవారం నుంచి ఎక్స్‌రే యంత్రం పని చేయడం లేదు. ఎక్స్‌రే పని చేయకపోవడంతో పేషెంట్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాంకేతిక సమస్యలతో ఎక్స్‌రే యంత్రం మొరాయించిందని వైద్యాధికారులు తెలిపారు. గత్యంతరం లేక పేషెంట్లు డబ్బులు వెచ్చించి ప్రైవేట్‌లో ఎక్స్‌రే తీయించుకుంటున్నారు. మరమ్మతు నిర్వహణ కోసం టీఎస్‌ఎంఎస్ఐడీసీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే వినియోగంలోకి తీసుకొస్తామని ఆర్‌ఎంవో డాక్టర్ అప్పారావు తెలిపారు.

డబుల్‌బెడ్రూం ఇళ్లను సిద్ధం చేయండి



డబుల్‌బెడ్రూం ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిరూరల్: పట్టణ శివారు హనుమంతునిపేట రోడ్డు, చందపల్లిరోడ్డులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను ఆవాసయోగ్యంగా సిద్ధం చేయాలని ఎమ్మెల్యే విజయరమణారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం పలువురు లబ్ధిదారులతో పాటు సంబంధిత అధికారులతో కలిసి డబుల్‌బెడ్రూం ఇళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణ పనులు జరిగినా.. విద్యుత్ పరమైన పనులు ఇంకా పూర్తికావాల్సి ఉందని, ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీల నిర్మాణంతో పాటు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉన్నట్లు గుర్తించారు. తాగునీటి సరఫరాకు అవసరమైన పనులు చేపట్టాల్సి ఉండడంతో అందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్‌తో పాటు విద్యుత్, తదితర శాఖల అధికారులు ఉన్నారు.

బల్దియాలో పూడికతీతపై స్పెషల్ డ్రైవ్



పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగం సిబ్బంది శుక్రవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. కూరగాయల మార్కెట్ పక్కన పెద్ద కాలువ వంతెన వద్ద వ్యర్థాలను తొలగించారు. వంతెన కింద నుంచి మురుగు నీరు సాఫీగా వెళ్లడానికి వీలుగా పూడిక తీశారు. పూడికతీత పనులను నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో నీళ్లు నిలిచి లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురి కాకుండా, నగరంలోని అన్ని ప్రధాన కాలువల్లో పూడిక తొలగింపు పనులు చేపట్టినట్లు డిప్యూటీ కమిషనర్ తెలిపారు. వ్యర్థాలు కాలువలో పడవేయకుండా కూరగాయలు, పండ్ల వ్యాపారులు, గృహస్తులు సహకరించాలని డిప్యూటీ కమిషనర్ కోరారు.

సీబీఎస్‌ఈ సిలబస్ అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్

రామగిరి: సింగరేణి కార్మికుల పిల్లలకు ఆర్జీ–3 డివిజన్‌లో సీబీఎస్‌ఈ సిలబస్ అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ముల్మూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో పర్సనల్ డీజీఎం ముప్పిడి రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలని సింగరేణి యజమాన్యం ప్రైవేట్ స్కూల్‌కు లీజుకు ఇచ్చిందన్నారు. కానీ ఆ ప్రైవేట్ పాఠశాల యజమాన్యం అధిక ఫీజులు వసూలు చేస్తూ ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నప్పటికీ సింగరేణి అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. సదరు ప్రైవేట్ స్కూల్‌కు ఇచ్చిన అగ్రిమెంట్ రద్దు చేసి సింగరేణి యజమాన్యం ఆధ్వర్యంలో స్కూల్ నిర్వహించాలని వినతిపత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. యజమాన్యం స్పందించని పక్షంలో కార్మికుల తల్లిదండ్రులతో కలిసి బీజేపీ పక్షాన ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సెంటనరీకాలనీ పట్టణ అధ్యక్షుడు తీగల శ్రీధర్, నాయకులు మెరుగు శ్రీకాంత్, తోట్ల రాజు, దోంతుల సురేశ్ పాల్గొన్నారు.

బోనస్ అందుకున్న సింగరేణి కార్మికులు



బోనస్ అందుకున్న కార్మికులతో అధికారులు

రామగిరి: ఆర్జీ–3 డివిజన్ ఓసీపీ–2లో బ్లాస్టింగ్ కార్మికులకు శుక్రవారం ఓసీపీ–2 మేనేజర్ రామరావు స్పెషల్ లింక్ బోనస్ అందజేశారు. ఈ బోనస్ కింద కార్మికుడికి 15గ్రాముల సిల్వర్ కాయిన్, స్వీట్స్ బాక్స్ పంపిణీ చేశారు. భవిష్యత్‌లో మరింత బాధ్యతగా విధులు నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి పాటుపడాలన్నారు. బ్లాస్టింగ్ ఇన్‌చార్జి జయకర్, సేఫ్టీ అధికారి ఆసీఫ్, పర్సనల్ మేనేజర్ మురళి, నాగేశ్వర్‌రావు, ఐఎన్‌టీయూసీ నాయకులు బత్తుల రమేశ్, వెంకటేశం, తాహెర్ పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి

జూలపల్లి: మండల కేంద్రం నుంచి పెద్దపల్లి జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలని బీజేపీ సీనియర్ నాయకులు అమరగాని ప్రదీప్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ నాయకులతో కలిసి తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దారు బషీరుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి వెళ్లే ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారిందని, గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైనట్లు ప్రకటనలు ఇచ్చారని తెలిపారు. పదేళ్లయినా రోడ్డు నిర్మాణం జరగక పోవడం దారుణమని ఆరోపించారు. అలాగే జూలపల్లిని ఆనుకొని ఉన్న లోలెవల్ వంతెనను పునర్‌నిర్మించాలని ప్రజలు కోరినా పట్టించుకోక పోవడం శోచనీయమన్నారు. నిర్మాణ పనులు వెంటనే చేపట్టకపోతే ఈ నెల 10న మండల కేంద్రంలో ధర్నా, రాస్తారోకోలు చేపడతామని పేర్కొన్నారు. నాయకులు పొద్దోళ్ల ఐలయ్య, కంచి శ్రీనివాస, మేరుగు కనుకయ్య, గుంటా అశోక, రాజయ్య, సతీశ్, దామోదర ఉన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

రామగుండం: అంగన్‌వాడీల పరిధిలోని ఇళ్లల్లో ఉన్న ప్రి స్కూల్ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చుకునేందుకు గ్రామాలు, వీధుల్లో అంగన్‌వాడీ బడి బాట నిర్వహించాలని సీడీపీవో గండ్ల స్వరూపరాణి సూచించారు. అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ ఆదర్శ (మోడల్) అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సెక్టార్ స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో ఇంటింటా బడిబాట ర్యాలీ చేపట్టాలని ఆదేశించారు. మండల సూపర్‌వైజర్ అంజలి , 24 కేంద్రాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ బడిబాట

జ్యోతినగర్: పిల్లలను అంగన్‌వాడీ కేంద్రల్లోనే చేర్పించాలని సూపర్‌వైజర్ పుష్పలత కోరారు. రామగుండం కార్పొరేషన్ 23వ డివిజన్ ఆటోనగర్, భీమునిపట్నం, సుభాష్ నగర్, అంబేద్కర్ నగర్, కాకతీయ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో శుక్రవారం బడిబాట నిర్వహించారు. చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ సతీశ్ చైల్డ్ లైన్ 1098పై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీలు సుధారాణి, రమాదేవి, వెంకటలక్ష్మి, అమృత పాల్గొన్నారు.

దేహదానానికి అంగీకారం

కోల్‌సిటీ: మరణానంతరం తమ దేహాలను వైద్య విద్య పరిశోధనలకు దోహపడేందుకు కాకతీయ మెడికల్ కాలేజీకి దానం చేస్తామని శుక్రవారం గోదావరిఖనికి చెందిన బత్తుల చక్రపాణి–మంగమ్మ ప్రకటించారు. సింగరేణి సంస్థలో సీనియర్ మైనింగ్ సూపర్‌వైజర్‌గా పని చేసి రిటైర్డ్ అయిన చక్రపాణి ప్రస్తుతం స్థానిక మార్కండేయకాలనీలో నివాసం ఉంటున్నాడు. అసోసియేషన్ ప్రతినిధులను దంపతులు నేరుగా కలుసుకొని వారి అంగీకార పత్రాలను అందజేశారు. తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కోనరెడ్డి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి కరేటి శంకర్‌రావు, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు కామిడి సతీశ్‌రెడ్డి, సభ్యులు బామాండ్లపెల్లి మల్లయ్య పాల్గొన్నారు.

ఖమ్మంపల్లిలో ఇసుక వేలం

ముత్తారం: మండలం ఖమ్మంపల్లిలో మానేరు ఇసుకను అక్రమంగా తరలించి ఒక దగ్గర కుప్పపోసిన 60 ట్రాక్టర్లను ఇసుకను ఏప్రిల్ 24న టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న ఇసుకకు ఈనెల 11న వేలం ఉందని తహసీల్దార్ సుమన్ ప్రకటనలో తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెద్దపల్లి జిల్లా :
9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
పెద్దపల్లి : కె.తిరుపతి, ACO - 7997958206
పెద్దపల్లి : ఎం.మహేందర్, SR - 9573331940
మంథని : రాజేశ్ - 9676603963
రామగుండం : సర్వర్ - 6281694028
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899